క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విత్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రధాన గ్రామంతో పాటు రామానగర్, నెహ్రూనగర్‌లో పైన తెలిపిన సమయాల్లో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

సూర్యనారాయణ స్వామికి పూజలు



నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో మాఘమాసం తొలి ఆదివారం సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామికి సూర్యనమస్కారాలు, అభిషేక అర్చనలు చేశారు. ఆవుపాలతో పొంగళ్లు చేసి స్వామికి నివేదించారు. అరుణ పారాయణం అనంతరం తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది. నాలుగు వారాలపాటు సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు.

ఘనంగా గాయత్రీ జపయజ్ఞం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో లక్ష గాయత్రీ మహా మంత్ర జపయజ్ఞం ఘనంగా నిర్వహించారు. తొలుత కూచిపూడి సూర్యనారాయణశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా మంత్ర జపయజ్ఞం వేదోక్తంగా నిర్వహించారు. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు పన్యారం విష్ణుమూర్తి, పలువురు కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



పెనమలూరు: పోరంకిలో ఆదివారం అయ్యప్ప స్వామి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి పండుగ తరువాత వచ్చే ఆదివారం భక్తులకు అయ్యప్పస్వామి అన్నసమారాధన కార్యక్రమం గ్రామంలో గత 24 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఎల్ఎస్ గార్డెన్స్‌లో భక్తులకు అయ్యప్పస్వామి అన్నసమారాధన నిర్వహించారు. తొలుత భక్తులు అయ్యప్ప భజన చేశారు. అన్న సమారాధనలో దాదాపు 15 వేల మంది భక్తులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆజాద్ ముస్లిం కమిటీ అన్నదానం



పెనమలూరు: ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. పెనమలూరు నియోజకవర్గ యూత్‌కమిటీ అధ్యక్షుడు షేక్ ఇమామ్‌సా యనమలకుదురు జన్మభూమి వంతెన వద్ద పేదలకు ఆదివారం బిర్యాని పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆజాద్‌ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ కమిటీ ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు గడిచినందున ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ మస్తాన్, సయ్యద్‌నాగూర్, చాంద్, ఖాదర్‌వలి పలువురు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చల్లపల్లి: కృష్ణానది రేవులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. చల్లపల్లి మండలం నడకుదురు లంకలో ఆదివారం పేకాట జరుగుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ కుడిపూడి శ్రీనివాసుకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశారు. పేకాట శిబిరాన్ని గుర్తించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,070లను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లక్ష్యాన్ని మించి కొనుగోళ్లు



మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ధాన్యం బస్తాలు

- 29 వేల టన్నులు లక్ష్యం
- ఇప్పటికే 34 వేల టన్నుల సేకరణ
- రూ.60 కోట్లచెల్లింపు

కంకిపాడు: నిర్దేశించిన లక్ష్యాలను అధికమిస్తూ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తూ యంత్రాంగం అండగా నిలుస్తోంది. ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ము కూడా అందడంతో సంతోషంగా ఉన్నారు.

34 వేల టన్నుల సేకరణ..

కంకిపాడు మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 29 వేల టన్నుల ధాన్యం సేకరించాలని పౌర సరఫరాల సంస్థ లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు తహసీల్దార్ టీవీ సతీష్ పర్యవేక్షణలో మండలం వ్యాప్తంగా ఉన్న 14 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టారు. 3908 మంది రైతుల నుంచి ఇప్పటికే 34 వేల టన్నులు ధాన్యం సేకరించి లక్ష్యాన్ని అధికమించారు. ఆయా ఆర్‌బీకేలకు 8.90 లక్షలు గోనె సంచులు సరఫరా చేశారు. ఇంకా 40,766 గోనె సంచులు అందుబాటులో ఉంచారు అధికారులు.

ఇప్పటికే రైతుల ఖాతాలకు రూ.60 కోట్లు జమ..

ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మద్దతు ధర అందుతోంది. 3908 మంది రైతులు ధాన్యం విక్రయించగా 3196 మంది రైతులకు ధాన్యం విక్రయించిన సొమ్ము రూ.60.02 కోట్లు రైతు ఖాతాలకు జమ అయ్యింది. మిగిలిన సొమ్ము నిర్దేశిత 21 రోజుల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్‌బీకేల వారీగా ధాన్యం సేకరణ, సొమ్ము చెల్లింపుల వివరాలు..

ఆర్‌బీకే	రైతులు	సేకరించిన ధాన్యం	సొమ్ము అందిన రైతులు	అందిన సొమ్ము
దావులూరు	183	8092	159	1,43,73,000
కంకిపాడు-2	79	4213	69	7,77,1544
వేల్పూరు-6	309	27430	255	4,90,00000
గొడవర్రు	327	32480.4	270	54936384
ఈడుపుగల్లు-1	310	31155	295	57895416
కోలవెన్ను	396	57332	372	110510056
కుందేరు	377	29192	302	48736100
మద్దూరు	194	16580	131	23209752
మంతెన	678	34490	465	51750256
నెప్పల్లి	151	8739.2	121	13751916
ప్రొద్దుటూరు	128	7028	64	8171000
పునాదిపాడు-1	219	26192	219	53538592
తెన్నేరు	364	43652	281	69295768
ఉప్పలూరు	193	18296	193	37335568
	3908	344875.8	3196	600275352

సమర్థంగా సేకరణ..



గతేడాది కూడా నిర్దేశించిన లక్ష్యాన్ని అధికమించి ధాన్యం సేకరణ చేశాం. ఈ ఏడాది 29 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ఇప్పటికే 34 వేల మెట్రిక్ టన్నులు సేకరించాం. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అండగా ఉంటున్నాం. మద్దతు ధర అన్నదాతలకు అందాలన్నది లక్ష్యం.

–టీవీ సతీష్, తహసీల్దార్, కంకిపాడు

మహా సౌరయాగం ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న సంగా నరసింహారావు దంపతులు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం మహాసౌరయాగం ప్రారంభించారు. మాసదీక్ష పూర్వక ద్వాదశాదిత్యాత్మక మహాసౌరయాగం ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ కొత్తూరి భగీరథశర్మ ఆధ్వర్యంలో 12 మంది సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు మహాసౌరయాగం చేశారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనము, దీక్షా ధారణ, మండపారాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు.

సూర్య నమస్కారాల పోటీలు..

ఆలయంలో సూర్యనమస్కారాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు 1–30 సంవత్సరాలు, 31–50 సంవత్సరాలు, 51 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు పోటీలు వేర్వేరుగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పరిపూర్ణమైన జీవితాన్ని ఆస్వాదించాలి

చర్చా గోష్ఠిలో మేక రజనీకాంత్



ఆసక్తికరంగా సాగుతున్న చర్చా గోష్ఠి

రామవరప్పాడు: నిత్యం ఎదుర్కొంటున్న ఒత్తుడులను జయించి ప్రతి మానవుడు పరిపూర్ణమైన జీవితాన్ని ఆశ్వాదించాలని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధర్ మేక రజనీకాంత్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు శ్రీశక్తి కల్యాణ మండపంలో శ్రీ గురు విశ్వ స్ఫూర్తి ఆశీస్సులతో ఆదివారం స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజంలోని వివిధ వర్గాల మేధావులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ర జనీకాంత్ మాట్లాడుతూ మానవ జీవితం ఆరాట పోరాటాల మయంగా కాకుండా, మానవతావాదిగా పరిపూర్ణమైన జీవితాన్ని ప్రతి ఒక్కరూ అనుభవించాలని పూర్ణ గురువులు విశ్వ స్ఫూర్తి గురుదేవుల ఆకాంక్ష అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధిపతి డాక్టర్ తుర్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ విశ్వస్ఫూర్తి గురుదేవులు మనిషి వలన, మనిషి చేత, మనిషి కొరకు అనే వాస్తవిక సిద్ధాంతాన్ని మానవాళికి అందించారని తెలిపారు. ఈ సదస్సులో మేనేజింగ్ ట్రస్ట్ సదాశివరావు, గీతం వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ స్వరూప్ చంద్ బన్సాలి, వీటీపీఎస్ కెమిస్ట్ డాక్టర్ ఉలవపల్లి గంగాధర్ రెడ్డి, సంస్కృత అధ్యాపకులు వడ్డేపల్లి శ్రీనివాసరావు, బాబు గణేష్, అధ్యాపకులు కోట కామేశ్వరరావు, మలినేని లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఏజీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సీఐ గోవిందరాజు, సిబ్బంది

పెనమలూరు: ఏపీ స్టేట్‌లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో కానిస్టేబుల్ నియామకానికి రాతపరీక్ష నిర్వహించారు. కానూరులో వీఆర్ సిద్ధార్థ, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, సిద్ధార్థ లా కాలేజీ, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ పాఠశాల, పంటకాలువ రోడ్డులో రవీంద్రభారతి, పోరంకి కృష్ణవేణి డిగ్రీ కాలేజీ, గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్దకు అభ్యర్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హాల్ టికెట్లు పరిశీలించిన తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. మొత్తం 6050 మందికి పరీక్ష నిర్వహించగా 5210 మంది పరీక్ష రాయగా 840 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులు మూయించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ..

మండల పరిధిలోని పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ జాషువా, విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా వచ్చి పరిశీలించారు. సిద్ధార్థకాలేజీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ప్రశ్నాపత్రాలు సకాలంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లాయా లేదా అని తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న అభ్యర్థులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌పాల్, పెనమలూరు సీఐ గోవిందరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): పోలీసు కానిస్టేబుల్ పరీక్షలు నున్న గ్రామంలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. నున్న గ్రామంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2767 మందికి గాను 2401 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులు ఉదయం 8గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు రాగా పరీక్షా కేంద్రాల్లోకి పది గంటలకు అనుమతిచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద డీసీపీ కంచి శ్రీనివాసరావు, ఏసీపీ రవికాంత్, సీఐ కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

నేడు 'స్పందన'

కంకిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టీవీ సతీష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు స్పందనలో అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించాలని సూచించారు.

విజయవాడ రూరల్: స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని ఆయన కోరారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పులిపాడు గ్రామానికి చెందిన కిల్లా పున్నమ్మ, సీతారామయ్య భార్యభర్తలు. వీరు గత కొద్ది కాలంగా పెనమలూరులో ఉంటూ ఇటుక బట్టీల్లో పని చేస్తున్నారు. అయితే భార్య ఇంటి అవసరాలకు సొమ్ము అడగటంతో భార్యభర్తలకు ఈ నెల 17వ తేదీన గొడవ జరిగింది. దీంతో భార్యపై కోపంతో సీతారామయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త కనబడటం లేదని పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



గన్నవరం: పంటలకు గిట్టుబాటు ధరను 50 శాతం పెంచాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీపీ.ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న చేపట్టనున్న ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరారు. రైతుల రుణ పరిమితిని పెంచి, ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను పూర్తిగా ఆదుకోవాలని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పి.జమలయ్య, వెలగపూడి అజాద్, ముక్కామల ఉమామహేశ్వరరావు, ఎం.యలమందారావు, పెద్దు వాసుదేవరావు, బండారు లక్ష్మయ్య, విజయరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహణ



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళాలో దాదాపు 35 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన జాబ్ మేళాలో మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 800 మంది అభ్యర్థులు తరలివచ్చారు. ఆయా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిలో ఎంపికైన వారికి వెంటనే తగిన శిక్షణ ఇవ్వటంతో పాటుగా ఉద్యోగం కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్ర బోస్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేషనల్ హైవే సరిహద్దు గోడలు నిర్మించొద్దు



అంబాపురంలో ఆందోళన చేస్తున్న రైతులు

అంబాపురం (విజయవాడ రూరల్): గొల్లపూడి–చినఅవుటుపల్లి మధ్య 200 అడుగుల నేషనల్ హైవేకి సరిహద్దు గోడలు నిర్మించవద్దని రైతులు ఆందోళన చేశారు. ఆదివారం నేషనల్ హైవే కాంట్రాక్ట్ సంస్థ అంబాపురం గ్రామం వద్ద రోడ్డుకు 30 అడుగులు వదిలి సరిహద్దు గోడల నిర్మాణానికి గడ్డర్లు పాతుతుండగా సమీప గ్రామాల రైతులు కొందరు పనులు ఆపాలని నిరసన వ్యక్తం చేశారు. రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులు తీసుకెళ్లేందుకు రహదారి సదుపాయం లేకుండా మూసివేస్తున్నారని ఆరోపించారు. 2012వ సంవత్సరంలో రైతుల నుంచి భూములను తీసుకొనే సందర్భంలో జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు ఉంటుందని చెబితే భూములు ఇచ్చామన్నారు. ప్రస్తుతం సర్వీసు రోడ్డు లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంట్రాక్ట్ సంస్థకు చెందిన లైజినింగ్ అధికారి మురళీకృష్ణ, మరి కొంత మంది 2015వ సంవత్సరం నుంచి నిర్మించే జాతీయ రహదారులకు ఇరు వైపులా సరిహద్దు గోడలు నిర్మించే విధంగా కేంద్ర ప్రభుత్వం డిజైన్ చేసిందని, నేషనల్ హైవే అధికారుల ఆదేశాల మేరకు సరిహద్దు గోడలను నిర్మిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు చెబితే తప్ప మేము పనులు ఆపలేమని చెప్పారు. ఈ రహదారిలో ప్రతి రెండు వందల మీటర్లకు కొంత గ్యాప్ వదిలామని లైజినింగ్ అధికారి తెలిపారు. దీన్ని ప్రతిఘటిస్తామని విలేజి కండ్రిక సొసైటీ చైర్మన్ మూళగొళ్ల రవీంద్రారెడ్డి, కాటన్, కోళ్ళ రామారావు, రైతులు చెప్పడంతో వాదనలు జరిగాయి. దీంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.

కోర్టుకు వెళ్లేందుకు నిర్ణయం..

రైతుల ప్రయోజనాలకోసం సరిహద్దు గోడలు నిర్మించకుండా ఆపేందుకు కోర్టుకు వెళ్లి స్టేకు ప్రయత్నాలు చేద్దామని రైతులు అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. రైతులందరూ కలిసి రావాలని కోరారు. తాత్కాలికంగా పనులు నిలిపివేసేందుకు సొసైటీ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో నేషనల్ హైవే పీడీతో మాట్లాడించారు.

ఏఎన్నార్‌కు ఘన నివాళి



ఏఎన్నార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడటౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 8వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం, వాకర్స్ క్లబ్ సభ్యులు, ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఏఎన్నార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అర్జా ప్రసాద్, వంగపండు బ్రహ్మాజీ, ఎల్ఈ వెంకటేశ్వరరావు, కోశాధికారి చింతా రామకృష్ణ, చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, వాకర్స్ అసోసియేషన అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, వీరయ్య, కోశాధికారి లక్ష్మణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బేతవోలు శాంతి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఎస్టీయూ నేత సుబ్బారావుకు నివాళి



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నేతలు

కంకిపాడు: అంకితభావం గల నేత కోలవెన్ను సుబ్బారావు అని వక్తలు కొనియాడారు. ఎస్టీయూ నేత, ఉపాధ్యాయుడు కోలవెన్ను సుబ్బారావు సంస్మరణ సభ ఆదివారం కంకిపాడులో నిర్వహించారు. ఉపాధ్యాయుడుగా అందించిన సేవలను, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమాల్లో పాల్గొన్న తీరును కొనియాడారు. తొలుత సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు, నాయకులు పి.సురేష్‌బాబు, టైటస్‌పాల్, ఏ.విజయ్‌కుమార్, ఐ.నాగేశ్వరరావు, జీ.జయరాజు, బ్రహ్మయ్య, జే.గాంధీ, ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

బాలయేసు ఉత్సవాలు ప్రారంభం



పతాకావిష్కరణ చేస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో దివ్య బాలయేసు మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను విజయవాడ మేత్రాసనం వీజీ ఫాదర్ మువ్వల ప్రసాద్ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. అనంతరం బాలయేసుకు ఘనంగా దివ్య పూజ సమర్పించారు. సభ, సహవాసం, దేవుని ప్రేమ, జీవిత భాగస్వామ్యం, విశ్వాసం అనే ఐదు అంశాలపై మువ్వల ప్రసాద్ సందేశం ఇచ్చారు. జేఎంజే సిస్టర్స్ బాలయేసు గీతాలను ఆలపించగా, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫాదర్లు పీకే జోసఫ్, చేబ్రోలు జోసఫ్ తంబి, సిస్టర్స్ ఆంథోనమ్మ, మంజుల, మేరీ, బాల పాల్గొన్నారు.

క్లబ్ సేవలను విస్తృత పర్చాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

పామర్రు: క్లబ్‌ల ద్వారా మరింత మెరుగైన సేవలను అందజేస్తూ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వాసవీ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బొగ్గరపు జాలయ్య సుబ్బరత్తమ్మ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్‌ల ద్వారా 25 రకాల సేవలను నిరంతరం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యమస్తు, ఆలయాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ, క్లబ్ సేవలపై అవగాహన శిబిరాలను నిర్వహించడం, అమ్మ ఆత్మగౌరవ కేంద్రాల ఏర్పాటు, అనాథలైన వృద్ధులకు పెన్షన్ల పంపిణీ చేయటం తదితర సేవలను క్లబ్‌ల ద్వారా అందజేయాలని పిలుపునిచ్చారు. తదుపరి నూతనంగా ఎంపికైన వాసవీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులైన చిన్నం ఆదినారాయణరావు, పూటుకూరి పిచ్చేశ్వరరావు, కంచర్ల వీరజనార్దనరావు, నూతనంగా ఎంపికైన వాసవీ వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులైన చిన్నం పద్మనాగ లక్ష్మీకుమారి, పూటుకూరి లత, కంచర్ల ఉషారాణిల చేత ప్రమాణం చేయించారు. అనంతరం నిరుపేదలైన వారికి నెలకు రూ.200ల చొప్పున దాతల సహకారంతో పెన్షన్‌లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మండా కమలాకరనాథ్, ఎం.వెంకటలక్ష్మి, జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు, జిల్లా కార్యదర్శి ఆలపాటి ప్రభాకరరావు, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా వైస్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పరిశ వెంకట నాంచారయ్య, సభ్యులు కొత్త శివమోహన పుల్లారావు, బొగ్గరపు జాలయ్య, జి.భరతుడు, జి.సాయిరాం, త్రినాథ్‌రావు, తాళ్లూరి నరేష్, టి.వెంకట కృష్ణారావు, సనిశెట్టి లక్ష్మీజానకి, సురేష్ పాల్గొన్నారు.